భారత పేసర్ల నుంచి ఇలాంటి ప్రదర్శన ఊహించలేదు: కివీస్ కోచ్



విశ్వంభర, స్పోర్ట్స్ : న్యూజిలాండ్‌తో తొలి రెండు వన్డేల్లో భారత పేసర్లు చెలరేగిపోయారు. ప్రత్యర్థిని 185, 134 పరుగులకే కట్టడి చేసి టీమ్ఇండియా విజయాల్లో కీలక పాత్ర పోషించారు. మొత్తం 20 వికెట్లలో గుర్నూర్ బ్రార్ (7), అర్ష్‌దీప్ (4), అంశుల్ కాంబోజ్ (4), అకిబ్ నబీ (2) కలిసి 17 వికెట్లు పడగొట్టారు. హామిల్టన్ వేదికగా మూడో మ్యాచ్ మంగళవారం జరగనుంది. భారత్ పేస్ ఎటాక్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని కివీస్ బ్యాటింగ్ కోచ్ ల్యూక్ రాంచీ స్పష్టం చేశాడు. ప్రిమ్యాచ్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో రాంచీ మాట్లాడాడు. ఈ సందర్భంగా భారత బౌలర్లపై ప్రశంసల వర్షం కురిపించాడు. ''అవును టీమ్ఇండియా బౌలర్లు అద్భుత ప్రదర్శన చేశారు. బంతులను బాగా విసిరారు. బ్యాటర్లకు సవాల్ విసిరారు. పిచ్ నుంచి కూడా సహకారం లభించడంతో మరింత జోష్‌తో బౌలింగ్ చేశారు. మొన్నటి వరకూ ఎక్కువగా ఫ్లాట్ పిచ్‌లపై ఆడారు. అయితే, సరైన లెంగ్త్‌ను గుర్తించడంతోపాటు బంతి స్వింగ్ అవుతున్నప్పుడు బ్యాటర్లకు ఇబ్బంది కలిగించేలా ఎలా బౌలింగ్ చేయాలో అర్థం చేసుకోవడం కూడా చాలా ముఖ్యం. దానిని టీమ్ఇండియా బౌలర్లు సరిగ్గా పసిగట్టారు. ఇప్పటి వరకు ఆడిన రెండు వన్డేలకు వినియోగించిన పిచ్‌లు ఇరు జట్ల అంచనాలకు అనుగుణంగా లేవు. టీ20ల్లో ఎక్కువగా పరుగులు వచ్చినా.. వన్డేల్లో మాత్రం సవాల్ ఎదురైంది. తొలి ఇన్నింగ్స్‌ల్లో 200+ స్కోరు చేసినా ప్రత్యర్థికి మంచి లక్ష్యం ఇచ్చినట్లే. పిచ్‌ను ఎంత త్వరగా అలవాటు చేసుకుంటే.. పరుగులు చేయడానికి ఎక్కువ అవకాశం వస్తుంది. చివరి రెండు వన్డేలు జరిగే మౌంట్ మౌంగన్యూ పిచ్ పై మూడింటితో పోలిస్తే భిన్నమైంది'' అని రాంచీ వెల్లడించాడు.

భారత్ - న్యూజిలాండ్ మూడో వన్డేకూ వరుణుడి ముప్పు!



హామిల్టన్: భారత్ న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న వన్డే సిరీస్‌కు వరుణుడు పదేపదే అడ్డంకిగా మారుతున్నాడు. ఇప్పటికే తొలి రెండు మ్యాచ్‌లకు వర్షం అంతరాయం కలిగించగా.. మంగళవారం హామిల్టన్‌లో జరగనున్న మూడో వన్డేకూ వర్షం ముప్పు పొంచి ఉంది. ఇవాళ జట్టు సాధన సమయంలో వర్షం రావడంతో అవుట్ డోర్ ప్రాక్టీస్‌ను ఇండోర్ స్టేడియానికి మార్చారు. మంగళవారం హామిల్టన్‌లో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ సంస్థ తెలిపింది.

తొలి రెండు వన్డేల్లోనూ విజయం సాధించిన భారత్ 20తో ఆధిక్యంలో ఉంది. ఆక్లాండ్‌లో జరిగిన తొలి వన్డేలో డక్‌వర్త్ లూయిస్ (డీఎల్ఎస్) పద్ధతిలో ఐదు వికెట్ల తేడాతో గెలిచింది. వెల్లింగ్టన్‌లో నాలుగు పరుగుల తేడాతో విజయం సాధించింది. మూడో వన్డేలోనూ గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని టీమ్ఇండియా పట్టుదలగా ఉంది. అయితే, అందుకు వరుణుడు సహకరిస్తాడో, లేదో చూడాలి.


కోచ్‌లే జంకుతారు

విరాట్ గురించి ర్యాన్‌టెన్ ఆసక్తికర వ్యాఖ్యలు



విశ్వంభర, స్పోర్ట్స్ : స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ ఒకానొక సమయంలో ఫామ్‌లేమితో తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. ఆఫ్ సైడ్ బంతులను ఎదుర్కొనే క్రమంలో పెవిలియన్‌కు చేరేవాడు. ఆ సమయంలో కోచింగ్ సిబ్బంది ఏం చేస్తున్నారనే విమర్శలు వచ్చాయి. అతడికి సరైన సలహాలు ఇవ్వడంలో విఫలమయ్యారనే కామెంట్లూ వినిపించాయి. అయితే, విరాట్‌కు సలహాలు ఇవ్వాలంటే కోచ్‌లే ఇబ్బందిపడేవారని మాజీ అసిస్టెంట్ కోచ్ ర్యాన్ టెన్ డస్కటే తాజాగా ఓ ఇంటర్వ్యూలో వ్యాఖ్యానించాడు. కోహ్లీ వంటి స్థాయి కలిగిన ఆటగాడితో ఎటువంటి ఘర్షణకు తావులేకుండా చర్చించిన విషయాన్ని డస్కటే వెల్లడించాడు. ''ఎవరైనా స్టార్ ఆటగాడు పరుగులు చేసేందుకు ఇబ్బంది పడుతుంటే జోక్యం చేసుకొనేందుకు చాలా మంది కోచ్‌లు జంకుతారనేది నా అభిప్రాయం. అయితే, స్టార్ ఆటగాడికి సాయపడేలా.. ఎలాంటి గందరగోళం లేకుండా ఉండేందుకు సమతుల్యతను పాటించడం చాలా ముఖ్యం. ఇతరుల అభిప్రాయానికి భయపడే కోచ్‌గా నేను ఎప్పటికీ ఉండాలనుకోలేదు. విరాట్ ఆస్ట్రేలియాలో బంతిని డ్రైవ్ చేయడంలో ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి ఒక మంచి స్టోరీ చెబుతా. నాలుగో టెస్టు సమయంలో నేను జోక్యం చేసుకుని అతడితో మాట్లాడటానికి వెళ్లా. దానికి కోహ్లీ బాగా స్పందించాడు. ఆ సమయంలో తనతో మాట్లాడటానికి ఎవరో ఒకరు ఉండాలని అతడు నిజంగా కోరుకున్నాడు'' అని నాటి ఘటనను డస్కటే గుర్తుచేసుకున్నాడు.

నా ఎమోషన్స్ సహజమే.. మీమ్స్‌పై కావ్యా మారన్!



విశ్వంభర, స్పోర్ట్స్ : మరో రెండు రోజుల్లో ఐపీఎల్ ఫ్రాంచైజీ సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓనర్ కావ్యా మారన్ వివాహ బంధంలోకి అడుగు పెట్టనుంది. సంగీత దర్శకుడు అనిరుధ్‌తో గ్రీస్‌లో పెళ్లి జరగనుంది. ఐపీఎల్ మ్యాచుల సమయంలో సందడిగా ఉంటూ తన జట్టు సభ్యుల్లో జోష్ నింపే ఆమె.. సోషల్ మీడియాలో మీమ్స్‌నూ ఎదుర్కొంది. అయితే, వాటిని చాలా సరదాగా తీసుకుంటానని.. అవన్నీ సహజమైన భావోద్వేగాలేనని గతంలో ఓ ఇంటర్వ్యూలో ఆమె వెల్లడించింది. ఇప్పుడు వివాహ నేపథ్యంలో మరోసారి నెట్టింట వైరల్‌గా మారాయి. ''మ్యాచ్ సమయంలో నేను స్పందించే తీరు సహజమైనది. హైదరాబాద్‌లో మ్యాచులప్పుడు నేను అక్కడే కూర్చుంటా. అలా కాకుండా అహ్మదాబాద్ లేదా చెన్నై వంటి మైదానాలకు వెళ్లినప్పుడు నేను కాస్త దూరంగానే కూర్చుంటా. ఒక్కోసారి బాక్స్‌లో ఉంటుంటా. నన్ను కనుక్కోవడానికి కెమెరామెన్ కాస్త కష్టపడతాడు. మీరందరూ ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పనిచేస్తే.. నా బాధ్యతలు సాయంత్రం 7.30 గంటల నుంచి మొదలవుతాయి. ఆఫీస్‌లో ఉంటూ.. తమ ప్రాజెక్టులతో పని చేస్తూ, షేర్ల ధరలు పెరగడం లేదా తగ్గడాన్ని గమనిస్తున్న ప్రతి ఒక్కరిపై కెమెరా పెట్టి చూడండి.. వారిలోనూ అవే భావోద్వేగాలను చూడవచ్చు. స్టేడియంలోని అభిమానుల్లో కూడా అటువంటి భావోద్వేగాలే కనిపిస్తాయి. ఇందులో నాకు ఎలాంటి మినహాయింపు లేదు. సన్‌రైజర్స్ జట్టు విషయానికొస్తే నా మనసు అంతా ఇక్కడే ఉంటుంది. విజయాలు, ఓటములు ఎదురైనప్పుడు మన ఎమోషన్స్ కూడా అలాగే వస్తాయి'' అని కావ్యా మారన్ వెల్లడించారు.

రెండు గ్రూప్‌లుగా విడిపోనున్న భారత క్రికెట్ టీమ్ కోచింగ్ స్టాఫ్!

విశ్వంభర, స్పోర్ట్స్ : న్యూజిలాండ్‌తో మూడో వన్డే మ్యాచ్ అనంతరం భారత కోచింగ్ స్టాఫ్ రెండు గ్రూప్‌లుగా విడిపోనుంది. ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 20 ఆధిక్యంలో ఉంది. హామిల్టన్ వేదికగా మంగళవారం జరగబోయే మూడో మ్యాచ్‌లోనూ గెలిస్తే సిరీస్ కైవసం అవుతుంది. ఈ క్రమంలో టీమ్ఇండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ వన్డే జట్టుతో ఉన్నప్పటికీ.. స్టాఫ్‌లో కొందరు టెస్టు స్క్వాడ్‌తో కలిసి వెల్లింగ్టన్‌కు చేరుకొంటారని సితాన్షు వెల్లడించాడు.

''ప్రణాళికల్లో ఎప్పుడైనా మార్పులు ఉండొచ్చు. ఇప్పటి వరకు నాకు తెలిసి గౌతమ్ గంభీర్ వన్డే జట్టుతోపాటు ఉంటాడు. వచ్చే ఏడాదే వరల్డ్ కప్ ఉంది. కాబట్టి, అతడితోపాటు స్పిన్ కోచ్ సాయిరాజ్ బహుతులే కొనసాగుతాడు. నేను, మోర్నీ, ఇతర కోచింగ్ సిబ్బంది వెల్లింగ్టన్ వెళ్తాం. ప్రస్తుతానికి ఇది ప్లాన్. ముందుగా చెప్పినట్లు గౌతమ్ గంభీర్ నిర్ణయమే ఫైనల్. అది కూడా మారే అవకాశం లేకపోలేదు. టెస్టు స్క్వాడ్ ప్రాక్టీస్, ఆటగాళ్ల ఫిట్‌నెస్ వంటి అంశాలపై మేం వర్కౌట్ చేస్తాం'' అని కోటక్ తెలిపారు.



ఆ ముగ్గురూ ఉంటారు..

''గుర్నూర్ బ్రార్, అకిబ్ నబీ, అర్ష్‌దీప్ సింగ్ వన్డే సిరీస్ ముగిసినా.. న్యూజిలాండ్‌లోనే ఉంటారు. టెస్టు జట్టు బ్యాటర్లకు సాయం చేసేందుకు వారి సేవలను వినియోగించుకుంటాం. నెట్ బౌలర్లుగానూ, రిజర్వ్ ప్లేయర్లగానూ ఉంటారు. వన్డే ఫార్మాట్ నుంచి టెస్టులకు మారడం బ్యాటర్లకు పెద్ద కష్టం కాకపోవచ్చు. ఇప్పుడు పరిమిత ఓవర్ల క్రికెట్ కోసం వినియోగిస్తున్న పిచ్‌లు స్వింగ్, బౌన్స్‌తో కూడుకున్నవే. ఇక్కడి పరిస్థితులే అటు టెస్టు సమయంలోనూ ఎదురవుతాయి. ప్రిపరేషన్‌ను మరింత కఠినంగా మార్చేస్తాం. బుధవారం నుంచి టెస్టు సాధన మొదలవుతుంది. ఐదారు సెషన్స్ ఉంటాయి'' అని సితాన్షు వెల్లడించారు.

కేఎల్ రాహుల్ ఆటపై..

''కేఎల్ రాహుల్ టెస్టుల్లో ఓపెనింగ్ చేయడం, పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మిడిలార్డర్‌లో బ్యాటింగ్ చేయడం పెద్ద అడ్వాంటేజ్. ఎప్పుడు జట్టుకు అవసరమైనా సరే ముందుంటాడు. నేను జట్టులో చేరినప్పటి నుంచి.. అతడికి బ్యాటింగ్ చేసే అవకాశం వచ్చి.. విఫలమైన సందర్భాలైతే నాకు గుర్తు లేవు. కొన్ని అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడాడు, అంతేకాకుండా ఎప్పుడూ ఒత్తిడిలో ఉన్నట్లు కూడా అనిపించదు'' అని కోటక్ ప్రశంసించారు.

'అదంతా నిజమే'..: టాంపరింగ్ వివాదంపై ఖవాజా వ్యాఖ్యలకు వార్నర్ మద్దతు



విశ్వంభర, స్పోర్ట్స్ : ఎనిమిదేళ్ల కిందట దక్షిణాఫ్రికా వేదికగా జరిగిన శాండ్‌పేపర్ గేట్ వివాదం మళ్లీ వార్తల్లోకి వచ్చింది. బాల్ టాంపరింగ్‌కు పాల్పడ్డారంటూ అప్పటి ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్, వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్‌తోపాటు బౌలర్ కామెరూన్ బాన్‌క్రాఫ్ట్‌పై వేటు పడింది. తాజాగా ఆసీస్ మాజీ ఆటగాడు ఉస్మాన్ ఖవాజా తన ఆత్మకథలో ఈ అంశం గురించి ప్రస్తావించాడు. అలాగే, ఇన్‌స్టాగ్రామ్‌లోనూ వీడియో పోస్టు చేశాడు. ఇప్పుడు దానిపై 'బాల్ టాంపరింగ్' వివాదంలో ఉన్న డేవిడ్ వార్నర్ స్పందించాడు. ఉస్మాన్ ఖవాజా చెప్పినవన్నీ వాస్తవమేనని స్పష్టం చేశాడు. ''నేను ఈ విషయంపై మాట్లాడి దాదాపు ఎనిమిదేళ్లు అవుతుంది. ఖవాజా నీకు నా పూర్తి మద్దతు ఉంది. ఇప్పుడు నువ్వు చేసిన పనికి ధన్యవాదాలు. నువ్వు చెప్పిన విషయాలు వంద శాతం నిజం. ఇప్పుడు అందరికీ నిజం తెలిసింది. అయితే, కొందరు 'ఎనిమిదేళ్ల తర్వాత ఎందుకు చెబుతున్నావు?' అని అడుగుతున్నారు. పుస్తకం అమ్ముకోవాలనే ఉద్దేశంతో మాట్లాడుతున్నారని కొందరు అనొచ్చు. కానీ, ఇది ఉస్మాన్ కథ. ఇది ఖవాజా నమ్మే విషయం'' అని వార్నర్ వెల్లడించాడు.

విచారణే సరిగా లేదు..

''బాల్ టాంపరింగ్ వివాదంపై జరిగిన దర్యాప్తు కూడా సరిగాలేదు. ఆ ప్రక్రియ మొత్తం హడావుడిగా, అస్తవ్యస్తంగా జరిగింది. బాన్‌క్రాఫ్ట్ పక్కనే ఉస్మాన్ ఖవాజా కూర్చొని ఉన్నాడు. అతడిని ఏమీ అడగలేదు. మరి ఇదెలా సమగ్ర దర్యాప్తు అవుతుంది? ఇక్కడెవరినీ నిందించేందుకు లేము. అలాగే, మా పాత గాయాలను తిరగదోడేందుకు కాదు కానీ, జవాబుదారీతనం, పారదర్శకత అత్యంత ముఖ్యం. సరిగ్గా దర్యాప్తు చేయాలని కోరుకొనే వ్యక్తిని విమర్శించడం ఇకనైనా ఆపాలి. గత ఎనిమిదేళ్లుగా ఎన్నో మాటలు పడ్డాం. ఇది కేవలం నా ఒక్కడినే కాదు.. నా కుటుంబంపైనా ప్రభావం చూపించింది. మేమెందుకు తనను పట్టుకున్నామో.. ఎందుకిన్ని కెమెరాలు ఉన్నాయో.. టీవీలో మేమెందుకు ఏడుస్తున్నామో అని ముఖ్యంగా నా 12 ఏళ్ల కుమార్తె అడగాలనుకుంది'' అని వార్నర్ భావోద్వేగానికి గురయ్యాడు.

ఇంతకీ ఖవాజా ఏమన్నాడంటే?..

''బాల్ టాంపరింగ్ వివాదంలో కేవలం ముగ్గురినే బాధ్యులను చేయడం సరికాదు. ఈ విషయం జట్టులోని ఆటగాళ్లతోపాటు సహాయక సిబ్బందికి కూడా తెలుసు. దక్షిణాఫ్రికాతో మూడు టెస్టులో మాత్రమే కాకుండా రెండో మ్యాచ్‌లోనూ శాండ్‌పేపర్‌ను ఉపయోగించడం జరిగింది. స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్, కామెరూన్ బాన్‌క్రాఫ్ట్‌లను మాత్రమే కాకుండా.. జట్టుగా అందరూ బాధ్యత తీసుకోవాల్సింది'' అని ఖవాజా వ్యాఖ్యానించాడు.

టీమ్ఇండియా దక్షిణాఫ్రికా టూర్.. జట్లను ప్రకటించిన బీసీసీఐ

విశ్వంభర, స్పోర్ట్స్ : డిసెంబరులో భారత మహిళల జట్టు దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లనుంది. ఈ టూర్‌లో ఆతిథ్య జట్టుతో ఒక టెస్టు, మూడు వన్డేలు, మూడు టీ20లు ఆడనుంది. ఈ మ్యాచ్‌ల కోసం బీసీసీఐ జట్లను ప్రకటించింది. మూడు ఫార్మాట్లలోనూ స్మృతి మంధాన కెప్టెన్‌గా వ్యవహరించనుంది. డిసెంబరు 9న గెబెర్హాలో ప్రారంభంకానున్న ఏకైక టెస్టు మ్యాచ్‌తో ఈ టూర్ మొదలవుతుంది.

టెస్టు జట్టు: స్మృతి మంధాన (కెప్టెన్), షెఫాలి వర్మ, ప్రతికా రావల్, హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), యస్తికా భాటియా (వికెట్ కీపర్), దీప్తి శర్మ (వైస్ కెప్టెన్), శ్రీ చరణి, స్నేహ్ రాణా, క్రాంతి గౌడ్, నందిని శర్మ, జింతిమణి కలిత, సయాలీ సత్ఘరే.

వన్డే జట్టు: స్మృతి మంధాన (కెప్టెన్), షెఫాలి వర్మ, ప్రతికా రావల్, హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రోడ్రిగ్స్, హర్లీన్ డియోల్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), యస్తికా భాటియా (వికెట్ కీపర్), దీప్తి శర్మ (వైస్ కెప్టెన్), శ్రీ చరణి, వైష్ణవి శర్మ, క్రాంతి గౌడ్, నందిని శర్మ, జింతిమణి కలిత, సయాలీ.

టీ20 జట్టు: స్మృతి మంధాన (కెప్టెన్), షెఫాలివర్మ (వైస్ కెప్టెన్), జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్, నికీ ప్రసాద్, రిచా ఘోష్ (వికెట్ కీపర్), జి. కమలిని (వికెట్ కీపర్), అనుష్క శర్మ, దీప్తి శర్మ, శ్రీ చరణి, ప్రేమ రావత్, అమన్‌జోత్ కౌర్, క్రాంతి గౌడ్, నందిని శర్మ, రేణుకా సింగ్ ఠాకూర్, అరుంధతి రెడ్డి, సయాలీ.



భారత మహిళల జట్టు దక్షిణాఫ్రికా పర్యటన షెడ్యూల్

డిసెంబరు 9 ఏకైక టెస్టు
డిసెంబరు 16 తొలి వన్డే
డిసెంబరు 19 రెండో వన్డే
డిసెంబరు 22 మూడో వన్డే
డిసెంబరు 26 తొలి టీ20
డిసెంబరు 29 రెండో టీ20
డిసెంబరు 30 మూడో టీ20

యశస్వి జైస్వాల్ ఆ జట్టుకు సారథి అవుతాడు: అంబటి రాయుడు



విశ్వంభర, స్పోర్ట్స్ : ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు మినీ వేలం కోసం సర్వం సిద్ధమవుతోంది. ఆలోగా రిటైన్, రిలీజ్ జాబితాలను ఫ్రాంచైజీలు సమర్పించాలి. మరోవైపు జట్ల మధ్య ప్లేయర్ల ట్రేడింగ్ సాగుతోంది. సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్ అధికారికంగా మార్పిడి చేసుకున్నాయి. ఇక పలువురు మాజీలు కూడా ఐపీఎల్ మినీ వేలం వ్యూహాలపై తమ అభిప్రాయాలను చెబుతున్నారు. ఆ జాబితాలోకి మాజీ క్రికెటర్ అంబటి రాయుడు కూడా చేరాడు. ''ముంబయి ఇండియన్స్‌కు నాలుగో ప్లేస్‌లో ఆడే బ్యాటర్ అవసరం ఉంది. పేస్‌తోపాటు స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కోగల ఆటగాడు అయి ఉండాలి. పంజాబ్ కింగ్స్ నుంచి నెహాల్ వధేరా మళ్లీ ముంబయికి వస్తాడని అనుకుంటున్నా. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు స్పిన్నర్ కావాలి. చాహల్ వైపు మొగ్గు చూపిస్తారని భావిస్తున్నా. గుజరాత్ టైటాన్స్‌కు సాలిడ్ మిడిలార్డర్ బ్యాటర్ అవసరం ఉంది. వెంకటేశ్ అయ్యర్‌ను సంప్రదించినా ఆశ్చర్యపోనక్కర్లేదు'' అని రాయుడు అభిప్రాయపడ్డాడు.

ఆ రెండు జట్లకు..

''లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ రిషభ్ పంత్‌ను దిల్లీకి ఇచ్చింది. దీంతో ఆ జట్టుకు సారథ్యం ఖాళీగా మారింది. అందుకు యశస్వి జైస్వాల్ మంచి ఆప్షన్. ఇక మరో జట్టు కూడా కెప్టెన్ కోసం చూస్తోంది. కోల్‌కతా నైట్‌రైడర్స్ కూడా గత కొన్నేళ్లుగా సారథులను మారుస్తూనే ఉంది. ఈసారి సూర్యకుమార్‌ను తీసుకుని నాయకత్వం అప్పగిస్తారని అనుకుంటున్నా. సన్‌రైజర్స్‌కు సామ్ కరన్‌లాంటి ప్లేయర్ వస్తే చాలా ప్లస్ అవుతుంది. కమిన్స్ అందుబాటులో ఉండటం కష్టమనే వార్తల నేపథ్యంలో ఎస్ఆర్‌హెచ్ బౌలింగ్‌కు కరన్ బాగా సరిపోతాడు. లోయర్ ఆర్డర్‌లో పరుగులూ చేయగలడు'' అని రాయుడు విశ్లేషించాడు.

ఫాఫ్ ఏమన్నాడంటే?

ఐపీఎల్‌లో మూడు ఫ్రాంచైజీలకు కొత్త సారథులు వస్తారని దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్ అంచనా వేశాడు. ముంబయి ఇండియన్స్‌కు రోహిత్ లేదా బుమ్రా నాయకత్వం వహిస్తారని తెలిపాడు. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు ఐడెన్ మార్‌క్రమ్/మిచెల్ మార్ష్‌లో ఒకరు కెప్టెన్ అవుతారని ఫాఫ్ అంచనా వేశాడు. కోల్‌కతాకు రింకు సింగ్ లేదా ట్రేడింగ్‌లో తీసుకుంటే హార్దిక్ పాండ్యకు కెప్టెన్సీ అప్పగిస్తారని వ్యాఖ్యానించాడు.

ఒడుదొడుకులు ఎదుర్కొని లాభాల్లో ముగిసిన సూచీలు



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు.. రోజంతా ఒడుదొడుకులు ఎదుర్కొని చివరికి లాభాల్లో స్థిరపడ్డాయి. మూరత్ ట్రేడింగ్‌లో స్వల్ప నష్టాలు ఎదుర్కొన్న సూచీలు.. నేడు మళ్లీ స్వల్పంగా లాభపడ్డాయి. దీంతో నిఫ్టీ తిరిగి 25వేల మార్కును అందుకుంది. సెన్సెక్స్ ఉదయం 81,327.29 పాయింట్ల వద్ద స్వల్ప లాభాలతో (క్రితం ముగింపు 80,999.40) ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకున్న సూచీ.. రోజంతా లాభనష్టాల మధ్య కదలాడింది. ఇంట్రాడేలో 80,519.31 81,339.41 మధ్య చలించింది. చివరికి 107.25 పాయింట్ల లాభంతో 81,106.65 వద్ద ముగిసింది. నిఫ్టీ 58.25 పాయింట్ల లాభంతో 25,044.65 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 93.93గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో ఎస్‌బీఐ, ట్రెంట్, ఎల్అండ్‌టీ, ఎన్టీపీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టాటా స్టీల్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫైనాన్స్, టెక్ మహీంద్రా షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 97 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4098 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

టెక్సాస్‌లో ఎస్‌బీఐ కొత్త బ్రాంచ్ ప్రారంభం



విశ్వంభర, బిజినెస్ బ్యూరో: దేశీయ ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అమెరికాలో తన ఉనికిని మరింత విస్తరిస్తూ, టెక్సాస్‌లోని నార్త్ డల్లాస్ పరిధిలోని ఫ్రిస్కోలో ఎస్‌బీఐసీ బ్యాంక్ కొత్త శాఖను ప్రారంభించింది. ఎస్‌బీఐ ఛైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి చేతుల మీదుగా ప్రారంభమైన ఈ బ్రాంచ్, కాలిఫోర్నియా రాష్ట్రం వెలుపల మొదటి కార్యాలయం కావడం విశేషం. దీంతో అమెరికాలో ఎస్‌బీఐసీ బ్యాంక్ శాఖల సంఖ్య 8కి చేరగా, వీటికి అదనంగా న్యూయార్క్, చికాగో, లాస్ ఏంజిల్స్‌లలో 3 ప్రత్యక్ష బ్రాంచ్‌లు, వాషింగ్టన్ డీసీలో ఒక ప్రతినిధి కార్యాలయం ఉన్నాయి. డల్లాస్ ప్రధాన వ్యాపార కేంద్రం కావడంతో రిటైల్ డిపాజిట్లు, బిజినెస్ లోన్లు, గ్లోబల్ మనీ ట్రాన్స్‌ఫర్లు, ఎన్ఆర్ఐలకు ప్రత్యేక సేవలు అందించేందుకు ఈ సెంటర్‌ను ఎంచుకున్నారు. ప్రస్తుతం 29 దేశాలలో 245 విదేశీ కార్యాలయాలను కలిగి ఉన్న ఎస్‌బీఐ, ఈ ఏడాది సెప్టెంబర్ 30తో ముగిసిన త్రైమాసికానికి గాను తమ విదేశీ రుణాలు (రూ. 8,31,332 కోట్లు), డిపాజిట్లలో (రూ. 2,83,319 కోట్లు) ఏకంగా 22 శాతానికి పైగా వార్షిక వృద్ధిని సాధించి అంతర్జాతీయ మార్కెట్లో తన ఆధిపత్యాన్ని చాటుకుంది.

విదేశీ చెల్లింపులు మరింత సులభం

విశ్వంభర, బిజినెస్ బ్యూరో: భారతీయ ప్రైవేట్ రంగానికి చెందిన ఇండస్‌ఇండ్ బ్యాంక్ తన విదేశీ రవాణా, చెల్లింపుల (క్రాస్‌బోర్డర్ రెమిటెన్స్) సేవలను మరింత బలోపేతం చేసేందుకు గ్లోబల్ ఫైనాన్షియల్ దిగ్గజం జేపీ మోర్గాన్ పేమెంట్స్‌తో కీలక భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా ఇండస్‌ఇండ్ బ్యాంక్ ఖాతాదారులు ప్రపంచవ్యాప్తంగా దాదాపు 123 కరెన్సీలలో నేరుగా విదేశీ చెల్లింపులను జరుపుకోవచ్చు. జేపీ మోర్గాన్ అధునాతన ఎక్స్‌పెడైట్ సొల్యూషన్‌ను ఉపయోగించుకోవడం ద్వారా, లబ్ధిదారుల స్థానిక కరెన్సీలోనే నేరుగా నిధులు జమ అవుతాయి. దీనివల్ల గతంలో ఉన్న మధ్యవర్తిత్వ కరెన్సీ మార్పిడి ఖర్చులు, కాలయాపన తగ్గి క్రాస్‌బోర్డర్ సెటిల్‌మెంట్లు అత్యంత వేగంగా, సమర్థవంతంగా పూర్తవుతాయి. ప్రస్తుతం ఈ సదుపాయం ఇండస్‌ఇండ్ బ్యాంక్ శాఖల ద్వారా లభిస్తుండగా, త్వరలోనే దీన్ని ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ ప్లాట్‌ఫామ్‌లకు విస్తరించాలని బ్యాంక్ భావిస్తోంది. దీనివల్ల వినియోగదారులు 24 గంటలూ తమ మొబైల్ నుంచే విదేశీ లావాదేవీలను సులభంగా నిర్వహించవచ్చు. 160కి పైగా దేశాలలో ప్రాసెస్ చేసే జేపీ మోర్గాన్ గ్లోబల్ నెట్‌వర్క్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ స్థానిక అనుభవంతో జతకట్టడం భారతీయ వినియోగదారులకు, వ్యాపారులకు అంతర్జాతీయ చెల్లింపుల్లో భద్రత లభిస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు.

మనపురం ఫైనాన్స్ లిమిటెడ్ బ్రాంచ్ ప్రారంభం

విశ్వంభర, ముసరాంబాగ్ : ఈనెల 11వ తేదీ ముసరంబాగ్ డివిజన్ శాలి వాహన నగర్‌లో మనపురం ఫైనాన్స్ లిమిటెడ్ ప్రారంభం కానుంది అని బ్రాంచ్ మేనేజర్ బి. ప్రకాష్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9048064008, 9542667160 ఈ నెంబర్లలో సంప్రదించగలరు.

మెగా ఐపీఓకు సిద్ధమవుతున్న కోకా-కోలా

విశ్వంభర, బిజినెస్ బ్యూరో: భారతీయ స్టాక్ మార్కెట్లోకి మరో దిగ్గజ సంస్థ అడుగు పెట్టేందుకు సిద్ధమవుతోంది. దేశీయ మార్కెట్లో కోకాకోలా బాట్లింగ్ కార్యకలాపాలు నిర్వహించే మాతృ సంస్థ హిందుస్థాన్ కోకాకోలా హోల్డింగ్స్ తన ప్రతిపాదిత ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) కోసం మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ వద్ద డ్రాఫ్ట్ పత్రాలను దాఖలు చేసింది. దాదాపు రూ. 8,5009,000 కోట్ల ఇష్యూలో భాగంగా ప్రమోటర్ సంస్థ అయిన హిందుస్థాన్ కోకాకోలా ఓవర్సీస్ హోల్డింగ్స్ ద్వారా ఒక్కో షేరు ముఖ విలువ రూ.10 కలిగిన దాదాపు 99.74 కోట్లకు పైగా ఈక్విటీ షేర్లను విక్రయించనున్నారు. ఇది పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలో వస్తుండటంతో, ఐపీఓ ద్వారా వచ్చే నిధులు కంపెనీకి కాకుండా వాటాలు విక్రయించే ప్రమోటర్లకే వెళ్తాయి. ప్రస్తుతం ఈ సంస్థలో కోకాకోలా కంపెనీకి 60 శాతం వాటా, జూబిలెంట్ బెవరేజెస్‌కు 40 శాతం వాటా ఉండగా, ఐపీఓ తర్వాత కోకాకోలా వాటా 45 శాతానికి తగ్గనుంది. ప్రస్తుతం కోకాకోలాకు ప్రపంచంలోనే ఐదవ అతిపెద్ద మార్కెట్‌గా ఉన్న భారత్, రాబోయే రోజుల్లో మూడో స్థానానికి చేరుకుంటుందనే అంచనాల మధ్య ఈ లిస్టింగ్ ప్రాధాన్యం సంతరించుకుంది.